క్లుప్తంగా

పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలను నిర్వహించారు. ఇక్కడ ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దున ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా.. వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీసియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరుక్రాస్ రోడ్, కుర్నపల్లి రోడ్‌లలో మోహరించిన పోలీసులు.. వచ్చి పోయే ఆదివాసీలన నిశితంగా తనిఖీ చేశారు. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు తనిఖీలు నిర్వహించారు.

కరపత్రాల ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ఆదర్శ నగర్ కాలనీలో మాలమహానాడు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్ మాట్లాడుతూ.. మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మహా అన్నదానం నిర్వహిస్తునామని, ప్రజలు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అల్లాడి జయ, తుమ్మల రాణి, దాసరి సామ్రాజ్యం, బట్టు లక్ష్మీకాంతం, డేగల వెంకటమ్మ, దాసరి వెంకన్న, డేగల ఏడుకొండలు, అల్లాడి వెంకటేశ్వర్లు, వాసు, తుమ్మల పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్‌ల పంపిణీ



క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఫజల్‌బక్షి

చంద్రుగొండ: మండలంలోని బాలికుంట, బెండాలపాడు గ్రామాల్లోని క్రీడాకారులకు అశ్వారావుపేట నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్‌బక్షి కిట్‌లను ఆదివారం పంపిణీ చేశారు. క్రీడల్లో రాణించి జాతీయస్థాయికి ఎదగాలని ఆయన కోరారు. క్రీడలతో స్నేహ భావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, మాజీ సర్పంచ్ వీసం రాములు, ఆంగోత్ కిషన్, రాయల నరేష్, గోగుల తిరుమలరావు, ఓర్సు రామకృష్ణ పాల్గొన్నారు.

మండల కిసాన్ సెల్ అధ్యక్షుడి నియామకం

భద్రాచలంటౌన్: భద్రాచల మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా దారపునేని రాంబాబుని నియమిస్తూ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో ఆదివార నియామక పత్రాన్ని రాంబాబుకి అందజేశారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరాల రవికుమార్, తమ్మళ్ళ వెంకటేశ్వరరావు, దేశప్ప రామచంద్ర రాజు, వరుణ్ పాల్గొన్నారు.

పాస్టర్ల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో పాస్టర్స్ ఫెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రాజమండ్రి వద్ద ఇటీవల పాస్టర్ ప్రవీణ్ అనుమానస్పద మృతిపై విచారణ జరిపి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కె.యోసురత్నం, ఎస్.లాజరస్, కె.జడ్సన్, అంద్రూస్ పాల్గొన్నారు.

మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి కేసీఆర్ తిరిగి మళ్లీ సీఎం కావాలని, ఆరోగ్యంతో ఉండాలని కోరుతూ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మోకాళ్లపై కుర్చొని మొక్కుక్కున్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు మోటూరి మోహన్, మాలోతు నవీన్, వంశీ నాయక్, రాంజీ పాల్గొన్నారు.



మోకాళ్లపై కుర్చొని మొక్కుతున్న యువకులు

విశ్వావసు నామ నూతనోత్సవం

శ్రీక్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి.. విశ్వావసు నామతెలుగు నూతన సంవత్సర ఉగాదిని ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గృహిణులు తమ ఇళ్ల వాకిళ్లను శుభ్రం చేసుకుని ఇంటి ముంగిట ముగ్గులతో, ఇళ్లలో మామిడి, వేప ఆకుల తోరణాలతో అలంకరించుకున్నారు. షడ్రుచుల సమ్మేళం ఉగాది పచ్చడి తయారుచేసి, సకుటుంబ సపరివార సమేతంగా ఆరగించారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయగా.. పండితులు పంచాంగ శ్రవణం చేశారు. రాశి ఫలాలను చదివి వినిపించారు. రైతులు ఉగాది సందర్భంగా ఏరువాక సాగారు. – సాక్షి నెట్‌వర్క్



అభయాంజనేయ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న దృశ్యం



దమ్మపేటలో మామిడి తోరణాలను కడుతున్న గ్రామస్తులు



మణుగూరురూరల్: మాజీ ఎమ్మెల్యేకు ఉగాది శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు



దుమ్ముగూడెం: పర్ణశాల ఆలయంలో పంచాగ శ్రవణం వినిపిస్తున్న అర్చకులు



అన్నపురెడ్డిపల్లి: వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు



బూర్గంపాడు: నాగినేనిప్రోలు ఆంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం



మణుగూరుటౌన్: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం..

పర్ణశాలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేపట్టారు. తొలుత గోదావరి నది నుంచి తీర్థ బిందె ద్వారా మేళ తాళాలతో పవిత్ర గోదావరి నుంచి పుణ్య జలాలను తీసుకుని వచ్చి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవ మూర్తులకు విశేష తిరుమంజనం, అభిషేకం కార్యక్రమాలను ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రిత్విక్వరణం, రక్షాబంధనం కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో నిర్వహించారు. యాగశాల వద్ద ప్రత్యేక హోమం నిర్వహించారు. ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించి స్వామివారికి ఘనంగా తిరువీధి సేవ నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, అర్చకులు ప్రతాపురం భార్గవాచార్యులు, కారంపూడి కిరణ్‌కుమారాచార్యులు, నలదీగ నరసింహ చార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, రాజగోపాల్ ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గోదావరి నది నుంచి పవిత్ర జలాలను తెస్తున్న అర్చకులు

ఘనంగా ఆశ్రమ వార్షికోత్సవం



వడ్లగూడెంలో వృద్ధురాలికి అన్నదాన పార్శిళ్లను ఆశ్రమం తరపున అందజేస్తున్న దంపతులు

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న శ్రీరంగనాథ స్వామి ఆశ్రమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో షిరిడీ సాయినాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు బాబాను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో సుమారు 200 మంది నిరుపేదలైన వృద్ధులు, అనాథలకు ఇంటి వద్దకే భోజన పార్శిళ్లను, వాలంటీర్ల ద్వారా అందజేశారు. సత్తుపల్లి మండలం, బేతుపల్లి గ్రామానికి చెందిన గోదా నాగబాబు, రజిని దంపతులు వారి కుమారుడు జశ్వంత్ జన్మదినం సందర్భంగా.. ఈ అన్నదాన కార్యక్రమానికి తగు ఆర్థిక సాయం అందజేశారు. ఆశ్రమానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం బాధ్యురాలు కూకలకుంట శ్రీదేవి ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లను చేశారు.

ఆదమరిస్తే అంతే..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానం సమీపంలో పెద్ద గుంత పడింది. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో గుంత కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకుని గుంతను పూడ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రహదారి పక్కనే ఉన్న గుంత

ఆగని పశువుల అక్రమ రవాణా



చర్ల నుంచి కబేళాలకు తరలుతున్న పశువులు

చర్ల: మండలంలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. చర్ల మండలానికి సరిహద్దున ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఉండగా.. ఆ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పశువులను ఇక్కడికి కారు చౌకగా దిగుమతి చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి వాటిని వ్యాపారులు మండలంలోని కొయ్యూరు, సుబ్బంపేట మీదుగా ఎదిర గట్టల తరకు కాలినడకన తరలించి అక్కడి నుంచి కంటైనర్లలో వెంకటాపురం మీదుగా వరంగల్, హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నారు. అదే విధంగా మండలంలోని మామిడిగూడెం, గోగుబాక, రాళ్లగూడెం గ్రామాల సమీపాల్లో ఉన్న గోదావని నది మీదుగా అశ్వాపురం, మణుగూరు మండలాల్లోకి తరలించి అక్కడి నుంచి వరంగల్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. చర్ల మండలంలోని పలు గ్రామాల్లో కమిషన్ పద్ధతిన కొందరు మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుంటున్నారు. నిత్యం ఈ తంతు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ.. అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో బడా నేతలు, వ్యాపారులు ఉండడంతో వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున అధికారులు ముడుపులు పుచ్చుకుంటున్నట్లు సమాచారం. గతంలో పశుప్రియులు, బీజేపీ, బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు రవాణాకు ఒకింత అడ్డు తగిలినప్పటికీ ప్రస్తుతం మౌనం వహించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రనక, పగలనక కొనసాగుతున్న ఈ అక్రమ పశువుల రవాణాను అడ్డుకునేందుకు ఇకనైన అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

'వోల్వో' పల్టీ

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–4లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఓబీ వెలికితీత పనులు నిర్వహిస్తున్న దుర్గా కంపెనీ వాల్వో ఆదివారం ఉదయం షిఫ్ట్‌లో ఉండగా పల్టీ కొట్టింది. వోల్వో ఓబీ డంప్‌యార్డ్ వద్ద అన్‌లోడ్ చేసి లోడ్‌కు వెళ్తున్న క్రమంలో పల్టీ కొట్టినట్లుగా తెలుస్తోంది ఈ ఘటనలో డ్రైవర్‌కి ఎటువంటి గాయాలు కాకపోవడంతో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. అనంతరం వాల్వోను జేసీబీ ద్వారా గ్యారేజీకి తరలించారు.

భూమిపూజ..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులో ఉన్న చిలకల గండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం ఆవరణలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా భూమి పూజ చేశారు. ఆలయం వద్దకు మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు, శుభ కార్యక్రమాల నిర్వహణ కోసం అశ్వారావుపేట మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్‌బాబు, మున్నూరు కాపు సంఘం బాధ్యులు కురిశెట్టి నాగబాబు, యూఎస్ ప్రకాశ్‌రావు, తాడేపల్లి రవి, పాశం రామారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు అన్నదానం

చర్ల: చర్లలోని మీ కోసం మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో వారపు సంతకు వచ్చిన ఆదివాసీలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఖమ్మంకు చెందిన దివంగత గండు గురవయ్య, మహాలక్ష్మిల జ్ఞాపకార్థం వారి కుమారుడు గండు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఆర్థిక సాయంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సుమారు 250 మంది ఆదివాసీలు ఇందులో పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

మణుగూరుటౌన్: స్థానిక ఐఎన్‌టీయూసీ నాయకులు అబ్దుల్ రవూఫ్–షాకీరా దంపతులు నిరుపేద ముస్లింలకు ఆదివారం తోఫా అందించారు. రంజాన్ ఈద్–ఉల్–ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకుని తన నివాసం వద్ద 35 మంది నిరుపేద ముస్లింలకు 15 రకాల నిత్యావసర వస్తువులతో పాటు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆరిఫ్ పాషా, ఆసిఫ్ పాషా, ఆఫ్రిన్, గౌసియా, అప్సరున్నీసాభేగం, తస్లీమా, సేవా సభ్యులు, సంధ్య, సామాజిక కార్యకర్త అంగోత్ మంగీలాల్ పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- కొనసాగుతున్న చిలకలగండి ముత్యాలమ్మ జాతర
- నాలుగో రోజు కుంకుళ్లమ్మ అలంకరణలో అమ్మవారు



అశ్వారావుపేటరూరల్: ముత్యాలమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేటరూరల్: మడలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆలయం వద్ద తిరునాళ్ల నాలుగవ రోజుకు చేరగా.. భక్తులకు అమ్మవారు భక్తులకు శ్రీ కుంకుళ్లమ్మ అలంకరణలో దర్శనం ఇచ్చారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని వివిధ రకాల పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అలాగే అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి చండీ పారాయణం, నివేదన, నీరాజన మంత్రపుష్పం, కుంకుమార్చన పూజలు చేశారు. ఉగాది పండుగ నేపథ్యంలో గ్రామ సేవ నిర్వహించగా, మహిళలు కోలాట నృత్యాలు చేయగా భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద జరిగిన తిరునాళ్లకు తెలంగాణ, ఏపీలోని పలు మండలాల నుంచి దాదాపు లక్షమంది భక్తులు హాజరయ్యారు. అర్ధరాత్రి సమయంలో పెద్దెత్తున బాణా సంచా కాల్చి సంబురాలను ఘనంగా నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. ఉత్సవాల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే జారే దంపతులు ఆలయానికి రాగా, వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ నరాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, యూఎస్ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్‌లోని ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా విశ్వావసు నామ ఉగాది సర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తుల నడుమ మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని గోదావరి నదికి తీసుకెళ్లారు. అర్చకులు పవిత్ర గోదావరి నదిలో అమ్మవారికి అభిషేకం కార్యక్రమాన్ని శాస్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రధాన ఆలయంలో ప్రతిష్ఠించిన తరువాత దూప దీప నైవేద్యాలు సమర్పించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు ముత్యాలమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: పట్టణ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు..

'పీఎం శ్రీ' నిధులు దక్కేనా?

- మొదటి, రెండో విడతలో 24 పాఠశాలలు ఎంపిక
- మరో 45 పాఠశాలలకు ఇంకో అవకాశం
- దరఖాస్తులు పూర్తి.. ఆన్‌లైన్ పనుల్లో విద్యాశాఖ
- అంతా అనుకూలిస్తే నిధులు మంజూరు



తాజాగా పీఎంశ్రీకి దరఖాస్తు చేసుకున్న అశ్వారావుపేట జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల

అశ్వారావుపేటరూరల్: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద గతంలో కొన్ని పాఠశాలకు ఎంపిక కాగా.. తాజాగా మరోసారి ఈ పథకం కింద ఇంకొన్ని పాఠశాలను ఎంపిక కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. దరఖాస్తులు పూర్తికాగా.. ఆయా పాఠశాలల ఎంపిక కోసం మండల విద్యాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులచేత కొత్త విద్యా విధానానికి తగట్టుగా అభివృద్ధి చేసేందుకు ఈ పీఎం శ్రీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి పాఠశాలకు చోటు కల్పించేందుకు దరఖాస్తులకు అవకాశాన్ని ఇచ్చింది. ఈ పథకం కింద మొదటి విడతలో 20 పాఠశాలలు, రెండో విడత 4 ఎంపిక కాగా మొత్తం 24 పాఠశాలలు ఎంపిక అయ్యాయి. కాగా, వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా నుంచి మరో 45 పాఠశాలను ఎంపిక చేసేందుకు ఇటీవలె దరఖాస్తులను ఆహ్వానించగా.. ఆయా పాఠశాలల బాధ్యులు అన్‌లైన్ విధానంలో దరఖాస్తులు సమర్పించారు.

అర్హత సాధించిన పాఠశాలలు ఇవే..

పీఎం శ్రీ పథకానికి మరోసారి కల్పించిన అవకాశంలో దరఖాస్తు చేసేందుకు జిల్లాలో 45 పాఠశాలలు అర్హత పొందాయి. వీటిలో అశ్వారావుపేట మండలం నుంచి (జెడ్పీహెచ్ఎస్ అశ్వారావుపేట, ఏజీహెచ్ఎస్ అనంతారం, ఏజీహెచ్ఎస్ భీమునిగూడెం), అన్నపురెడ్డిపల్లి, భద్రాచలం, జూలూరుపాడు, ఇల్లెందు మండలాల్లో మూడు చొప్పున, అలాగే చంద్రుగొండ, అల్లిపల్లి, చర్ల, గుండాల, చుంచుపల్లి, కరకగూడెం, మణుగూరు, సుజాతనగర్ మండలాల నుంచి ఒకొక్క పాఠశాల, ములకపల్లి, బూర్గంపాడు, టేకులపల్లి మండలాల్లో రెండేసి చొప్పున, పాల్వంచ మండలానికి నాలుగు, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు ఐదు చొప్పున పాఠశాలు ఉన్నాయి. ఈ పాఠశాలను బెంచ్ మార్క్‌గా గుర్తించి అన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తులను ఆయా మండలాల ఎంఈఓలు ప్రత్యేక్షంగా పరిశీలిస్తున్నారు. పూర్తి అయిన అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి నివేదికలు ఇస్తారు. జిల్లా విద్యాశాఖ అధికారి వాటిని ధృవీకరణ చేసి రాష్ట్రస్థాయికు పంపిస్తారు. అనంతరం విద్యా శాఖ ఉన్నతాధికారుల నుంచి పీఎం శ్రీకు ఎంపికైన పాఠశాలల జాబితాను విడుదల చేస్తారు.

పీఎం శ్రీకి నిధులు ఇలా..

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న పీఎం శ్రీ పథకాన్ని ప్రతి ఏటా పాఠశాలల ఎంపిక సంఖ్యను పెంచుతోంది. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు విడతల వారిగా నిధుల కేటాయింపు చేస్తుండటంతో ఆయా పాఠశాలకు ఈ పథకం వరంగా మారుతోంది. పాఠశాలకు నాలుగు విద్యా సంవత్సరాలకు కలుపుకుని ప్రాథమిక పాఠశాలకైతే రూ.19లక్షలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.కోటి 20లక్షలు, ఉన్నత పాఠశాలకు రూ.2కోట్ల నిధులు కేటాయిస్తోంది. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల భవనాలు, క్రీడా మైదానాలు, కంప్యూటర్ బోధన పరికరాలకు, ఇతర అవసరాలకు వినియోగించుకునే అవకాశం కల్పించింది.

ఇసుకవాగుపై వంతెన పరిశీలన



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కాంతారావు

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెంలో ఇసుకవాగుపై వంతెన నిర్మాణ పనులను ఆదివారం పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వంతెన పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు రూ.4 కోట్లతో నిధులు మంజూరు చేయించి ఈ వెంతెనకు శంకుస్థాపన చేశానని, ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. గొందిగూడెం ఉమ్మడి గ్రామ పంచాయతీలో తాటి నాని, వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన తాటి రామయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు రేగా హాజరై.. బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను రేగా ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ సర్పంచ్‌లు పర్శిక సూరిబాబు, కలేటి నరసింహారావు, నాయకులు కందుల కృష్ణార్జున్‌రావు, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, రామకృష్ణ, చందూలాల్, డాక్టర్‌బాబు, పున్నారావు, రాజేష్ పాల్గొన్నారు.